సాక్షి సంగారెడ్డి

గురువారం । 1 । ఆగస్టు । 2024



నాడు ప్రజా బాట.. నేడు ఉపాధి వేట

పోతరాజుగా శివ్వంపేట మండలంలోని ఉసిరికపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బాబురావు

ఐదేళ్ల కాలంలో గ్రామ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగియడంతో కుటుంబ పోషణపై దృష్టిసారించారు. కొందరు సొంత ఊరిలో పొలం పనులు చేస్తుండగా, మరికొందరు వ్యాపారాలు చేస్తూ జీవనం గడిస్తున్నారు. పదవీ కాలం ముగిసిన స్థానిక సంస్థ మాజీ ప్రజాప్రతినిధుల ప్రస్తుత జీవన స్థితిగతులపై సాక్షి ప్రత్యేక కథనం.

వివరాలు 8లో ▶

న్యూస్‌రీల్

నేటి నుంచి పోలీస్ యాక్ట్ అమలు



ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లావ్యాప్తంగా నెల రోజుల పాటు ఆగస్టు 1 నుంచి 31 వరకు.. 30, 30(ఎ) పోలీస్ యాక్ట్–861 అమలులో ఉంటుందని ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిదే జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని సూచించారు. అనుమతి లేకుండా పై కార్యక్రమాలు నిర్వహిస్తే సదరు వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అందరూ సమానమే..

- ఆర్డీఓ అశోక చక్రవర్తి



మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక చక్రవర్తి

నారాయణఖేడ్: గ్రామాల్లో అందరూ సమానంగా మసలుకోవాలని ఆర్డీఓ అశోక చక్రవర్తి సూచించారు. మనూరు మండలం తిమ్మాపూర్‌లో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతి, మత, కుల, వర్గం, పుట్టిన ప్రదేశం, రంగు ఆధారంగా వివక్షత, అంటరానితనం పాటించకూడదని సూచించారు. అందరూ సమానత్వంతో మసలుకోవాలన్నారు. ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటస్వామి, ఎస్‌ఐ రాజశేఖర్, గిర్దావర్ శంకర్‌రెడ్డి, రాంచందర్, జూనియర్ అసిస్టెంట్ ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.

టెట్ మార్కుల నమోదుకు చాన్సివ్వండి

జహీరాబాద్: డీఎస్సీ 2024లో ఉపాధ్యాయ అర్హత పరీక్షలో (టెట్) ఇంప్రూవ్‌మెంట్ ద్వారా సాధించిన మార్కుల నమోదుకు అవకాశం కల్పించాలని నిరుద్యోగ ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మొదటిసారిగా నిర్వహిస్తున్న డీఎస్సీలో టెట్ ద్వారా పొందిన మార్కులను అప్‌లోడ్ చేశామన్నారు. అయితే ఇంప్రూవ్‌మెంట్ ద్వారా చాలా మంది అభ్యర్థులు ఉన్నతమైన మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. తద్వారా నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు మేలు జరుగుతుందన్నారు. ఈ మేరకు విద్యాశాఖ సంచాలకులు, ప్రభుత్వ కార్యదర్శి, టీజీపీఎస్సీ చైర్మన్‌లు తమ పట్ల సానుకూల స్పందనను తెలియజేస్తూ టెట్ మార్కుల నమోదుకు ఆప్షన్ ఇవ్వాల్సిందిగా అభ్యర్థులు కోరుతున్నారు.

ప్రమాద రహిత డ్రైవింగ్‌కు ప్రాధాన్యం

- ఎంవీఐ వెంకటయ్య

జహీరాబాద్ టౌన్: ఆర్టీసీ డ్రైవర్లు ప్రమాద రహిత డ్రైవింగ్ చేయాలని ఎంవీఐ వెంకటయ్య సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం రాత్రి ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగా ఎవరూ కూడా ప్రమాదాలు చేయరన్నారు. కొన్ని సందర్భాల్లో అనుకోకుండా జరుగుతాయన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని చెప్పారు. మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డిపో మేనేజర్ కార్తీకులు పాల్గొన్నారు. అత్యధిక ప్రమాద రహిత డ్రైవర్లు శంకరయ్య, వినోదయ్యలను సన్మానించారు.

మెస్ చార్జీలు పెంచాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్

జహీరాబాద్ టౌన్: హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నాయకులతో కలిసి ఆయన పట్టణంలోని వసతి గృహాలను సందర్శించారు. విద్యార్థుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగినా మెస్ చార్జీలను మాత్రం పెంచడం లేదన్నారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల పట్ల చిన్నచూపు చూస్తోందన్నారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. తాగు నీరు తదితర సమస్యల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సంబంధిత శాఖ అధికారులు వసతి గృహాలను సందర్శించాలని విన్నవించారు. ఆ మేరకు మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్, సభ్యులు నరేశ్, రాజు హరీశ్ పాల్గొన్నారు.

‘ఔటర్’ పంచాయతీలు విలీనం?

- ఓఆర్ఆర్‌కు ఇరువైపుల ఉన్న గ్రామాలు
- అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీల పరిధిలో 12 విలేజ్‌లకు చాన్స్
- ప్రభుత్వానికి చేరిన జిల్లా స్థాయి కమిటీ ప్రతిపాదనలు



ముత్తంగి గ్రామపంచాయతీ (ఫైల్)



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఔటర్ రింగ్‌రోడ్డుకు ఇరువైపుల ఉన్న గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఆయా గ్రామ పంచాయతీలు పట్టణీకరణకు దగ్గరగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల పరిధిలో సుమారు 12 గ్రామ పంచాయతీలు సమీపంలో ఉన్న తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీల్లో విలీనమయ్యే అవకాశాలున్నాయి. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇందులోనే ఈ విలీనానికి సంబంధించిన నిర్ణయం ఉంటుందా? లేదా తర్వాత ప్రభుత్వ నిర్ణయం ఉంటుందా? అనే అంశంపై చర్చ జరుగుతోంది.

గ్రామాల సర్వే నంబర్‌లతో సహా..

మున్సిపాలిటీల్లో విలీనమయ్యే గ్రామ పంచాయతీల పూర్తి వివరాలతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. గ్రామ జనాభా, గ్రామంలోని ఓటర్ల సంఖ్య, పంచాయతీ వార్డుల సంఖ్య, గ్రామపంచాయతీ విస్తీర్ణం, ఆయా గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న భూముల సర్వేనంబర్లు, గ్రామ పంచాయతీకి వివిధ టాక్సుల రూపాల్లో వస్తున్న ఆదాయం ఇలా పూర్తి వివరాలతో జిల్లా స్థాయి కమిటీ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. దీనిపై రాష్ట్ర కేబినేట్‌లో నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలిసింది. కాగా గ్రామపంచాయతీల పాలక వర్గం పదవీ కాలం కొద్ది నెలల క్రితమే ముగియడం విదితమే. గ్రామపంచాయతీలన్నీ ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మున్సిపాలిటీల్లో విలీనం నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఈ గ్రామ పంచాయతీల విలీనానికి సంబంధించిన ప్రతిపాదనలు జిల్లా అధికార యంత్రాంగం మంగళవారం ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు కలెక్టర్ నేతృత్వంలోని ఓ జిల్లా స్థాయి కమిటీని వేసింది. ఏయే గ్రామ పంచాయతీలు విలీనం చేసేందుకు అనువుగా ఉన్నాయనే అంశంపై వారం రోజులుగా స్టడీ చేసిన ఈ కమిటీ విలీనమయ్యే పంచాయతీల వివరాలతో కూడిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు.

విలీనమయ్యే అవకాశమున్న పంచాయతిలివే..

సంగారెడ్డి జిల్లా పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డుకు ఇరువైపుల ఉన్న గ్రామపంచాయతీలను పరిశీలిస్తే.. పాటి–ఘనపురం, కర్దనూరు, నందిగామ, బానూరు, ముత్తంగి, ఇస్నాపూర్, చిట్కుల్, పాశమైలారం, పోచారం, రామేశ్వరం బండ, బచ్చుగూడెం, సుల్తాన్‌పూర్, దయార, కిష్టారెడ్డిపేట, ఐలాపూర్, పటేల్‌గూడ, ఇంద్రేశం, చిన్నకంజర్ల, పెద్దకంజర్ల, ఐనోలు, ఖాజీపల్లి, మాదారం తదితర గ్రామపంచాయతీలున్నాయి. ఇందులో సుమారు 12 గ్రామ పంచాయతీలను అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీల్లో విలీనం చేయనున్నారు. కొన్ని గ్రామాలను ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలో కలిపే అవకాశాలు కూడా ఉన్నాయి.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ క్రాంతి

ముర్రుపాలు శ్రేష్ఠం

- నేటి నుంచి 7 వరకు తల్లిపాల వార్షికోత్సవం
- కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ వి. క్రాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ సెంటర్లలో, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో తల్లి పాల విశిష్టతను తెలపాలని ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. బాలామృతం ఏడు నెలల నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు అందించాలని వాటిపైన విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం పోస్టర్ ను విడుదల చేశారు. డీఎంహెచ్ఓ గాయత్రీదేవి, డీపీఓ సాయిబాబా, బీడబ్ల్యూఓ లలితకుమారి, డీఈఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.క్రాంతి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. యువత చెడు అలవాట్ల వైపు ఆకర్షితులైతే వచ్చే నష్టాలపైన ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల దగ్గర ఎటువంటి పాన్‌షాపులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఉండకూడదన్నారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశామని ఈ కమిటీ సభ్యులు ఆయా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఆపై అవగాహన కార్యక్రమాలు చేపడతారన్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి సాగు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ రూపేశ్ అన్నారు. డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పోలీస్ శాఖ తరపున వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాల రవాణా, విక్రయాల సమాచారం తెలిస్తే 87126–56777 నంబర్‌లో సమాచారం అందించాలన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ రమేశ్, అదనపు కలెక్టర్ మాధురి, ఎక్సైజ్ కమిషనర్ నవీన్ చంద్ర, అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. కలెక్టరేట్లో జిల్లా, మండలాధికారులతో కలిసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో డెంగీ, టైఫాయిడ్ మలేరియా లాంటి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలను ప్రతి మున్సిపాలిటీ, పంచాయతీల్లో నిర్వహించాలన్నారు. శానిటేషన్ విషయంలో శ్రద్ధ వహించాలన్నారు. రోజూ క్రమం తప్పకుండా దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని ఎక్కడైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలని, పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వైద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బల్దియా అవినీతిమయం

- ఎన్నికల ఖర్చు పేరుతో నిధులు స్వాహా
- పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానం
- మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల మండిపాటు



మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాద్ చౌహాన్

సంగారెడ్డి : అవినీతిమయంగా మున్సిపల్ బల్దియా తయారైందని, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఖర్చు పేరుతో మున్సిపల్ నిధుల స్వాహా చేశారని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సంగారెడ్డి బల్దియాలో బుధవారం చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి అధ్యక్షతన పాలక వర్గ సమావేశం వాడీవేడిగా సాగింది. ట్రైనీ కలెక్టర్ మనోజ్ సమక్షంలో పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. పారిశుద్ధ్యం, కుక్కల బెడద, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాలు తదితర సమస్యలపై వాడీవేడి చర్చ జరిగింది. కౌన్సిలర్ కూన వనితా మాట్లాడుతూ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పాల్గొన్న సిబ్బందికి మజ్జిగ, తాగునీరు సరఫరా చేసినట్లు తప్పుడు రికార్డులు రాసి మున్సిపల్ నుంచి లక్షలాది రూపాయలు ఖర్చు చేయడమేమిటని ప్రశ్నించారు. గత సంవత్సరం నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా సిబ్బందికి గౌరవ భృతి అందజేసినట్లు లెక్కల్లో చూపి అప్పటి కమిషనర్ లక్షలాది రూపాయలు స్వాహా చేశారని ఆరోపించారు. ఎన్నికల ఖర్చుపై ఎలాంటి ఆడిట్ ఉండదన్న ఉద్దేశంతో మున్సిపల్ అధికారులు నిధులు వాడుకోవడం ఏమిటని ప్రశ్నించారు. మరో కౌన్సిలర్ కొత్తపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ వైకుంఠ రథంపై బీఆర్ఎస్ ఎంఎల్‌ఏ చింతా ప్రభాకర్ ఫొటో ఉండడాన్ని నిర్ధించుకోలేక ఆ వాహనాన్ని నిరుపయోగంగా మూలన పడేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కౌన్సిలర్‌లు పొన్న రాజేందర్ రెడ్డి, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు మాట్లాడుతూ, పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. ఇంటింటి చెత్త సేకరణ సవ్యంగా జరగడం లేదని అసహనం వ్యక్తం చేశారు. నివాస ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 32వ వార్డు కౌన్సిలర్ నాయికోటి రామప్ప.. తమ అనేక వార్డులో వీధి దీపాలు వెలగడం లేదన్నారు. ప్రధాన రహదారిపై హైమాస్ట్ లైట్లు మూడు నెలలుగా వెలగడం లేదన్నారు. పట్టణంలో వీధి కుక్కల బెడదను అరికట్టడంలో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వాటి నివారణకు ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో శునకాలను అరికట్టడం లేదని ఆరోపించారు. కమిషనర్ సురేశ్, డీఈ ఇంతియాజ్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షురాలి హౌస్ అరెస్టు

- మహిళల రక్షణలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : మహిళలకు రక్షణ కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి విమర్శించారు. బుధవారం రాష్ట్రంలో జరుగుతున్న అఘాయిత్యాలపై బీజేపీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా రామచంద్రాపురంలోని ఆమె నివాసంలో పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోజురోజుకూ రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. వారికి రక్షణ కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమెతోపాటు నాయకులు నందారెడ్డి, రజిని, శ్రీలక్ష్మి, బసవమ్మ, గీత, కనకరాజు, మల్లేశ్, నరసింహులు ఉన్నారు.



గోదావరి అంజిరెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

వేతనాల కోసం ఎదురుచూపు

- 13 నెలలుగా అందని వైనం
- 1962 అంబులెన్స్ సిబ్బంది ఆందోళన



ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నారాయణఖేడ్: 13 నెలలుగా వేతనాలు అందడం లేదని 1962 అంబులెన్స్ పశువైద్యాధికారిణి డా.రహియ, పారావెటర్నర్ అంబయ్య, పైలెట్ ప్రవీణ్, సహాయకుడు నరేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో మూగజీవాలకు వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో 2017 నుంచి ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కో అంబులెన్స్‌ను కేటాయించారన్నారు. ఒక్కో చోట పశువైద్యాధికారి, పారావెటర్నర్, పైలెట్, సహాయకుడిగా ఒక్కొక్కరిని నియమించారన్నారు. ప్రభుత్వం గడిచిన 15 నెలలుగా సంస్థకు నిధులు చెల్లించడం లేదన్నారు. దీంతో 13 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నా సేవలను కొనసాగిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో మూగజీవాలకు వైద్యం అందిస్తూ పాడి రైతుల సంక్షేమానికి పాటు పడుతున్నామన్నారు. కాగా, ప్రభుత్వం జీవీకే సంస్థకు నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. వైద్యులకు రూ.56 వేలు, పారావెటర్నర్‌కు 20 వేలు, పైలెట్‌కు రూ.18 వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్షీరాభిషేకం



రుణమాఫీ రెండో విడత లబ్ధిపొందిన రైతులు సంబురాలు జరుపుకొన్నారు. బుధవారం మండలంలోని బానాపూర్‌కు చెందిన రైతులు పంచాయతీ కార్యాలయ ఆవరణలో సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు నాగేశ్వర్‌రావు, దామోదర, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి చిత్రపటాలు ఉన్న ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు – నారాయణఖేడ్



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అఖిలేశ్‌రెడ్డి తదితరులు

ఇన్నోవేటర్లకు మంచి అవకాశం

వినూత్న ఆవిష్కరణలు చేసేందుకు ఇన్నోవేటర్‌లకు ఇదే మంచి అవకాశం అని జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి అఖిలేశ్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఐటీఐ నుంచి కలెక్టరేట్ వరకు ఇంటింటా ఇన్నోవేషన్‌లో భాగంగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమం నిర్వహిస్తోందని అందరూ అర్హులేనన్నారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ అధికారి జగదీశ్ సంబంధిత శాఖ అధికారులు , విద్యార్థులు పాల్గొన్నారు. –సంగారెడ్డి టౌన్

ఫుల్లు కావాల్సిందే

అమ్మకాలు పెంచాలని వైన్స్‌షాపు యజమానులపై ఒత్తిడి!

- 2023 జూలైలో కొన్నట్లే.. గత నెలలోనూ అదే తరహాలో లిఫ్ట్ చేయాల్సిందేనంటున్న ఎక్సైజ్ శాఖాధికారులు
- అంతగా విక్రయాలు లేవంటున్న మద్యం వ్యాపారులు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డిలో ప్రధాన రహదారిపై ఉన్న ఓ వైన్స్ గత ఏడాది 2023 జూలైలో రూ.1.30 కోట్ల విలువ చేసే మద్యాన్ని ఐఎంఎఫ్ఎల్ డిపో నుంచి కొనుగోలు (లిఫ్ట్) చేసింది. ఈనెల జూలైలో అంతగా అమ్మకాలు లేకపోవడంతో సుమారు రూ.1.10 కోట్ల విలువైన మద్యాన్నే లిఫ్ట్ చేయాల్సి వచ్చింది. మిగిలిన రూ.20 లక్షల విలువైన మద్యాన్ని కూడా కొనాల్సిందేనని ఎక్సైజ్ శాఖ అధికారులు ఒత్తిడి తెచ్చారని, మరో రూ.20 లక్షల విలువ చేసే మద్యాన్ని కూడా లిఫ్టు చేయాల్సి వచ్చిందని ఆ వైన్స్ యజమాని వాపోయాడు.

ఒకే రోజే రూ.17 కోట్ల అమ్మకాలు

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరు ఎక్సైజ్.. తన ఆదాయాన్ని పెంచుకునేందుకు ఈ శాఖ ఆపసోపాలు పడుతోంది. మద్యం అమ్మకాలను మరింత పెంచాలని వైన్స్‌ల యజమానులపై ప్రత్యక్షంగానే ఒత్తిడి తెస్తున్నారు. గత ఏడాది జూలైలో ఐఎంఎఫ్ఎల్ డిపో నుంచి కొనుగోలు చేసిన మద్యం విలువకు ఏ మాత్రం తగ్గకుండా ఈనెలలో కూడా మద్యాన్ని కొనాల్సిందేనని వైన్స్‌ల యజమానులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో బుధవారం ఒక్క రోజే సుమారు రూ.17 కోట్ల విలువ చేసే మద్యం కొల్చారంలోని ఐఎంఎల్ డిపో నుంచి లిఫ్ట్ అయింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు నిధులను సమకూర్చడంలో ఎక్సైజ్ ఆదాయం కీలకమైంది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు మద్యం అమ్మకాలను మరింత పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే వైన్స్‌ల యజమానులపై అమ్మకాలు పెంచాలని ఒత్తిడి తెస్తున్నారు.

ఎట్టకేలకు లెక్క సరి చేశారు

మెదక్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉన్న 118 వైన్స్‌లు, 16 బార్లకు మెదక్ జిల్లా కొల్చారంలో ఉన్న ఐఎంఎఫ్ఎల్ (తెలంగాణ రాష్ట్ర బెవరేజెస్ లిమిటెడ్) డిపో నుంచి మద్యం సరఫరా అవుతోంది. 2023 జూలై నెలలో రూ.113.67 కోట్లు విలువ చేసే మద్యం అమ్మకాలు జరగగా, 2024 జూలై నెలాఖరు (బుధవారం) వరకు రూ.116 కోట్లు విలువ చేసే మద్యం లిఫ్ట్ కావడం గమనార్హం. ఈ లెక్కన గత ఏడాది జూలై నెలతో పోల్చితే ఏ మాత్రం తగ్గకుండా అంతకంటే సుమారు రూ.మూడు కోట్లు ఎక్కువ విలువ చేసే మద్యాన్నే ఎక్సైజ్ అధికారులు లిఫ్ట్ చేయించారంటే ఆశాఖ తీరును ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

అమ్మకాలు తగ్గాయంటున్న వ్యాపారులు

గత ఏడాదితో పోల్చితే ప్రస్తుతం మద్యం అమ్మకాలు భారీగా తగ్గాయని మద్యం వ్యాపారులు పేర్కొంటున్నారు. గత ఏడాది ఎన్నికలు ఉండటంతో కొంత ఎక్కువ మద్యం విక్రయాలు జరిగాయి. అయితే లోక్‌సభ ఎన్నికలు కూడా ముగిశాయి. దీంతో జూలైలో అమ్మకాలు పడిపోయాయి. గత ఏడాది జూలైతో పోల్చితే ఈ జూలైలో సుమారు 20 శాతం మేరకు తగ్గాయని వైన్సుల యజమానులు చెబుతున్నారు. అయితే అధికారుల మాట కాదనలేక కొందరు వైన్స్‌ల యజమానులు జూలైలో అవసరానికి మించి మద్యాన్ని లిఫ్టు చేయాల్సి వచ్చిందని వాపోతున్నారు.



కొల్చారంలోని ఐఎంఎఫ్ఎల్ డిపో

అలాంటిదేమీ లేదు..

మద్యం స్టాక్ లిఫ్టు చేయాలని వైన్స్‌ల యజమానులపై ఎలాంటి ఒత్తిడి చేయలేదు. వారు వారికున్న డిమాండ్.. అమ్మకాల మేరకు స్టాక్ లిఫ్ట్ చేసుకుంటారు. డబ్బులతో కూడుకున్న విషయం. మేము లిఫ్ట్ చేయమంటే వాళ్లెందుకు లిఫ్టు చేస్తారు. వారి అవసరం మేరకే మద్యాన్ని కొంటారు.

: నవీన్‌చంద్ర, ఎక్సైజ్ సూపరింటెండెంట్

క్లుప్తంగా

పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలి

- నేటి నుంచి ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు
- డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ

మెదక్ కలెక్టరేట్: పుట్టిన వెంటనే పాపలకు ముర్రుపాలు తాగించాలని, ఫలితంగా రోగ నిరోధక శక్తి వృద్ధి చెందుతుందని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి బ్రహ్మాజీ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నేటి నుంచి 7వ తేదీ వరకు జిల్లాలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పుట్టిన వెంటనే పాపకు ముర్రుపాలను అందించడం, వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తామన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో వివిధ కార్యక్రమాలు చేయడం, ఐసీడీఎస్ సెక్టార్ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆశ, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్ల ఉమ్మడి గృహ సందర్శన నిర్వహిస్తామన్నారు. గ్రామస్థాయిలో పాలిచ్చే తల్లులకు కౌన్సిలింగ్ తోపాటు హాస్పిటల్ సందర్శనలు చేయనున్నట్లు తెలిపారు. స్వయం సహాయక బృందాలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా పడి ఉన్న సామగ్రి

శివ్వంపేట(నర్సాపూర్): తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధి తిమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాసంగారి సురేశ్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో ఊరెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి తాళం పగులగొట్టి ఇంట్లో తులం బంగారం, 20 తులాల వెండి, రూ.60 వేల నగదు ఎత్తుకెళ్లారు. చోరీ సమయంలో దొంగలు పక్కింటి ఇళ్ల తలుపులకు గడియలు పెట్టారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీం, పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నకిలీ బంగారం బిస్కెట్‌తో మోసం

- పెళ్లి పేరుతో రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్న దంపతులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు



నకిలీ బంగారు బిస్కెట్

పటాన్‌చెరు టౌన్: నకిలీ బంగారు బిస్కెట్‌తో మోసానికి పాల్పడిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి కథనం మేరకు.. అమీన్‌పూర్ మండలంలోని కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన రాజరాజేశ్వరి రెండు నెలలుగా బీరంగూడలోని భ్రమరాంబిక కాలనీలో కిరాణా షాపు నడుపుతోంది. అప్పుడప్పుడూ కిరాణా సామగ్రి తీసుకోవడానికి రమణమ్మ అనే మహిళ వచ్చేది. జూలై 7వ తేదీన రమణమ్మ, ఆమె భర్త కలిసి రాజరాజేశ్వరి కిరాణా షాపు వచ్చారు. కూతురు వివాహం ఉందని కొంత డబ్బు కావాలని అడిగారు. అందుకు షూరిటీగా గోల్కొండ కేబుల్ లైన్ తవ్వకాల్లో దొరికిన ఓ బంగారం బిస్కెట్ పెడుతామని, రూ.8 లక్షలు ఇవ్వాలని అడిగారు. తన దగ్గర అంత డబ్బు లేదని, రూ.4 లక్షలు ఇచ్చి బంగారు బిస్కెట్‌ను తన వద్ద పెట్టుకుంది. ఐదు రోజులు తర్వాత కిరాణషాపు నిర్వాహకురాలు రమణమ్మకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చి బిస్కెట్‌ను బంగారం షాపులో చెక్ చేయించగా నకిలీదని తేలింది. బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి దంపతులిద్దరిపై బుధవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



డబుల్ బెడ్‌రూంల ప్రారంభోత్సవంలో చిట్టాపూర్ మాజీ సర్పంచ్ రాజయ్య (ఫైల్)



ప్రస్తుతం ఎండు మిర్చి అమ్ముతున్న రాజయ్య

నాడు ప్రజా బాట.. నేడు ఉపాధి వేట

- రోజు వారి పనుల్లో మాజీ సర్పంచ్‌లు
- గతంలో గ్రామాల అభివృద్ధిలో నిమగ్నం
- ప్రస్తుతం పొలం, కూలీలకు వెళ్తూ జీవనం
- చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు

పంట పొలాల్లో బాల్‌చంద్రం

గజ్వేల్‌రూరల్: గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రజలకు గ్రామ ప్రథమ పౌరుడిగా సేవలందించిన సర్పంచ్ నేడు పంటపొలాల బాట పట్టాడు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి వరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకొని.. నేడు పదవీకాలం ముగియడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యాడు అక్కారం మాజీ సర్పంచ్ గునికెట్టి బాల్‌చంద్రం. 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో మొత్తం 8 మంది సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలువగా బాల్‌చంద్రం 460 ఓట్ల మెజార్టీతో సర్పంచ్‌గా గెలుపొందారు. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి మంజూరైన సుమారు రూ.2 కోట్ల 50లక్షల నిధులతో డైనింగ్ హాల్, కమ్యూనిటీ భవనాలు, అంగన్వాడీ, పాఠశాల తరగతి గదులు, మహిళా భవనం, లైబ్రరీ, గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అప్పులు చేసి అభివృద్ధి పనులను చేపట్టగా ప్రభుత్వం నుంచి ఇంకా రూ.8 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటికీ 6 నెలలుగా ఎవరికి ఆపద వచ్చినా తానున్నానంటూ ప్రజలతోనే మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం పరితపిస్తున్నాడు. ప్రస్తుతం తనకున్న 4 ఎకరాల వ్యవసాయ భూమిలో వరి, మొక్కజొన్న, పత్తి పంటలను సాగు చేస్తూ నిత్యం ప్రజాక్షేత్రంలో ఉన్నాడు.



వరినారు వేస్తున్న బాల్‌చంద్రం

మళ్లీ వ్యవసాయంతోనే



జగదేవ్‌పూర్(గజ్వేల్): తనకున్న పొలంలో పంటలు సాగు చేసే యువకుడు గత ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలిచి ఐదేళ్లు ప్రజా సేవ చేశాడు. పదవీ కాలం పూర్తికావడంతో మళ్లీ వ్యవసాయం చేస్తున్నాడు. గత ఎన్నికల్లో జగదేవ్‌పూర్ మండలంలోని కొండాపూర్‌కు చెందిన తిగుళ్ల జహంగీర్ సర్పంచ్‌గా పోటీ చేయగా గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైనర్ పంచాయతీ కావడంతో ఆదాయం లేకున్నా అభివృద్ధి పనులు చేపట్టాడు. ఇందుకు సంబంధించి రూ.1.50 లక్షలు రావాల్సి ఉందని తెలిపాడు.

తోటి మహిళలతో వరినాట్లు



కూలీలతో కలిసి వరినాట్లు వేస్తున్న రేణుక

తొగుట(దుబ్బాక): ఐదేళ్లు గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన మంగ రేణుక వ్యవసాయ కూలీ పనులకు వెళ్తున్నారు. మండలంలోని లింగంపేట సర్పంచ్‌గా భర్త నర్సింలుతో కలిసి గ్రామాభివృద్ధికి నిజాయితీగా పనిచేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన రేణుక సర్పంచ్‌గా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించారన్న పేరు తెచ్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిత్తశుద్ధితో గ్రామాభివృద్ధికి కృషిచేశారు. ఆమె హయాంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. పదవి నుంచి దిగిపోయి సాధారణ మహిళగా తోటి మహిళలతో కలిసి వరినాట్లు వేసేందుకు వెళ్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

కులవృత్తే ఉపాధి

శివ్వంపేట(నర్సాపూర్): సర్పంచ్‌గా పని చేసినప్పటికీ కులవృత్తిని మాత్రం మరిచిపోలేదు. మండలపరిధి ఉసిరికపల్లి గ్రామ సర్పంచ్‌గా పని చేసిన బాబురావు పోతురాజు వృత్తి చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వంశపారపర్యంగా వస్తున్న వృత్తిలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పోతరాజు గావు, బైన్ల పంబాల, ఎర్పుల వాలితో పాటు పలు రకాల పూజా కార్యక్రమాలు చేస్తున్నాడు.



మీ సేవ నడుపుతున్న రాజయ్య

ఎంఎస్సీ, బీఈడీ చదివి సర్పంచ్‌గా..

ఎంఎస్సీ, బీఈడీ చేసిన ఉన్నత విద్యావంతుడైన దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి తాజా మాజీ సర్పంచ్ కంద్లకొయ్య పరుశరాములు గ్రామంలోనే మీ సేవ నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఉన్నత విద్యా వంతుడైన పరుశరాములు గతంలో మీ సేవ సెంటర్ నడిపిస్తూ ప్రజలతో మంచి సంబంధాలు ఉండటంతో గ్రామస్తులు పట్టుబట్టి సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఐదేళ్లు నమ్మకంగా పనిచేసి ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నాడు. రూ.10 లక్షల వరకు అప్పు తెచ్చి అభివృద్ధి పనులు చేసిన బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. సర్పంచ్ కాక ముందు మీ సేవ నడిపిన పరుశరాములు సర్పంచ్ అయ్యాక పూర్తిగా ప్రజాసేవకే అంకితమై మీ సేవను ఆపరేటర్‌ను పెట్టి నడిపించాడు. చిన్న వయస్సులో ప్రజలకు సేవ చేయడం చాలా ఆనందంగా ఉందని, ఇప్పుడు మీ సేవ నడిపించుకుంటూ ప్రజల సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తున్నానని చెప్పారు.



మీ సేవలో కంద్లకొయ్య పరుశరాములు

ఎండు మిర్చి బేరం చేస్తూ..

దుబ్బాక: దుబ్బాక మండలం (ప్రస్తుతం భూంపల్లి–అక్బర్‌పేట మండలం)లోని చిట్టాపూర్‌కు వరుసగా రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పని చేశారు పోతనక రాజయ్య. అంతకు ముందు మిర్చి బేరం చేసిన రాజయ్య వరుసగా రెండు సార్లు సర్పంచ్ అయ్యాక పూర్తిగా ప్రజాసేవకే అంకితమయ్యాడు. బీఏ చదివిన రాజయ్య గతంలో కండక్టర్‌గా 2 ఏళ్లు హకీంపేట డిపోలో పని చేసి కానిస్టేబుల్ ఉద్యోగం రావడంతో పోలీస్ ఉద్యోగం సైతం చేశాడు. ఉద్యోగాలు సైతం వదులుకొని గ్రామంలోనే ఉంటూ వ్యవసాయం, మిర్చి బేరం చేసుకుంటున్న రాజయ్యను గ్రామస్తులు వరుసగా 2 సార్లు సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా రాజయ్య చాలా అభివృద్ధి పనులు చేసి దుబ్బాక మండలంలోనే మంచి సర్పంచ్‌గా పేరొందాడు. గ్రామాభివృద్ధికి వెచ్చించిన రూ.10 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ప్రస్తుతం ఎండిన మిర్చి గతంలో చేసిన బేరం చేసుకుంటున్నాడు.

అవినీతి ఆరోపణలతో మాకు సంబంధం లేదు

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు



గజ్వేల్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు

గజ్వేల్: మున్సిపల్ భవన ప్రారంభోత్సవానికి చేసిన ఖర్చులో అవినీతి జరిగిందని, ఇందులో కౌన్సిలర్ల భాగస్వామ్యం ఉందని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు బాలేష్, ఆత్మెల్లి శ్రీనివాస్, గుంటుకు శిరీష, గంగిశెట్టి చందన, రజిత, వరలక్ష్మీ, బాలమణి, శ్యామల, విద్యారాణి, దుంబాల లక్ష్మీ, కురాకుల శ్రీనివాస్ స్పష్టం చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ భవన ప్రారంభోత్సవ ఖర్చులను అప్పట్లో మున్సిపల్ చైర్మన్, కమిషనర్ కలిసి ముందుగానే డ్రా చేశారని, వారిని నిలదీస్తే దాటవేశారని తెలిపారు. ఈ విషయంపై సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినా సరైన సమాచారం ఇవ్వలేదన్నారు. ఈ అంశంపై అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా చైర్మన్ వైఖరిని నిరసిస్తూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఈ అవినీతిలో కౌన్సిలర్లకు కూడా భాగముందని ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిరాధార ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు.

కన్న కొడుకే కామాంధుడై..

తల్లిపై అత్యాచారం..
మెదక్ జిల్లాలో ఘటన

చేగుంట/వెల్దుర్తి(తూప్రాన్): తాగిన మైకంలో కన్నతల్లిపై అత్యాచారం చేశాడో కామాంధుడు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మాసాయిపేట గ్రామానికి చెందిన లక్ష్మణ్(38) కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బోనాల సందర్భంగా భార్యాపిల్లలు హైదరాబాద్‌కు వెళ్లారు. ఇంట్లో తల్లీ కొడుకు మాత్రమే ఉన్నారు. సోమవారం రాత్రి పీకలదాక తాగిన లక్ష్మణ్.. మత్తులో కన్నతల్లి (60) అని చూడకుండా ఆమెపై అత్యాచారం చేశాడు. బుధవారం సాయంత్రం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గంజాయి స్వాధీనం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రామాయంపేట సీఐ వెంకటరాజంగౌడ్, నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినోద్దీన్ కథనం మేరకు.. ఆదిలాబాద్ జిల్లా మావల మండలం సుభాష్ నగర్‌కు చెందిన షేక్ సలీమ్(31) మేస్త్రీ పనిచేస్తాడు. ఇతను నిర్మల్ నుంచి బైక్‌పై వస్తూ గంజాయి తీసుకొస్తున్నాడనే సమాచారం అందింది. నార్సింగి పోలీస్‌స్టేషన్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి అతడి వాహనం తనిఖీ చేసి 46 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నిండు గర్భిణిని చిదిమేసిన కంటైనర్

- బైక్‌ను ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం
- తెగిపడిన గర్భస్థ శిశువు తల
- మెదక్ జిల్లాలో విషాదకర ఘటన



లారీ చక్రాల మధ్య బైక్

మనోహరాబాద్(తూప్రాన్)/మిరుదొడ్డి(దుబ్బాక): కంటైనర్ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఏడు నెలల గర్భిణి దుర్మరణం చెందింది. ఆమె గర్భంలో ఉన్న శిశువు తల తెగి బయటపడింది. హృదయ విదారకరమైన ఈ సంఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం మల్లుపల్లె గ్రామానికి చెందిన పనేటి రేణ(29), పోచయ్య దంపతులు. వీరికి పదేళ్లలోపు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. తండ్రి పోచయ్య దగ్గరే ఉంటున్నారు. ఇతను గ్రామంలో కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ భారంగా మారడంతో రేణ.. బతుకుదెరువు కోసం గ్రామాన్ని విడిచి వెళుతుండేది. చిన్న చిన్న పనులు చేసుకుంటూ గ్రామానికి వస్తూ ఉండేది. కాగా, రేణ, బాబు, గుర్తు తెలియని వ్యక్తితో కలసి బైక్‌పై మేడ్చల్ వైపు 44వ జాతీయ రహదారిపై వెళ్తున్నారు. మనోహరాబాద్ మండల కేంద్రం దగ్గరలోకి రాగానే వేగంగా వచ్చిన కంటైనర్ వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై వెనకాల కూర్చున్న రేణ.. లారీ టైరు కిందపడి నలిగిపోయింది. శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. ఆమె కడుపులో ఉన్న 7 నెలల గర్భస్థ శిశువు తల తెగి మృతదేహం సైతం బయటపడింది. బైక్ నడుపుతున్న వ్యక్తికి, బాలుడికి గాయాలయ్యాయి. ప్రమాదం జరగ్గానే సదరు వ్యక్తి బాలుడిని తీసుకుని పరారయ్యాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. బైక్ నడిపిన వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కాగా, గర్భిణి రేణ దుర్మరణంపై సొంతూరు మల్లుపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.



రేణ (ఫైల్)

అప్పట్లో శిశువు విక్రయం.. సంచలనం

రేణ, పోచయ్య కుటుంబం పేదరికంతో దుర్భర జీవితం గడుపుతున్నారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. వీరిని పోషించే ఆర్థిక స్థోమత లేక ఐదేళ్ల క్రితం ఒక శిశువుని దత్తతకు ఇచ్చారు. మగ శిశువుని అమ్ముకున్నారన్న వార్త జిల్లాలో సంచలనంగా మారింది. దీంతో దత్తతకు ఇచ్చిన బాలుడిని అధికారులు శిశు సంరక్షణకు తరలించడం, ఆ తర్వాత అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

అన్ని కోణాల్లో పరిశోధించాలి

- సిద్దిపేట సీపీ అనురాధ
- పెండింగ్ కేసులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: దొంగతనాల కేసులను అన్ని కోణాల్లో పరిశోధించి ఛేదించాలని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై బుధవారం సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతీ దరఖాస్తుదారుడితో సంబంధిత ఎస్ఐ తప్పకుండా మాట్లాడి సమస్య తెలుసుకొని పరిష్కరించాలన్నారు. తరచుగా నేరాలు చేసే నేరస్తులపై తప్పకుండా షీట్స్ ఓపెన్ చేయాలన్నారు. డయల్ 100 కాల్‌కు వెంటనే స్పందించాలన్నారు. బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పట్టణాలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్ ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీలు మధు, సతీష్, రవీందర్, శ్రీనివాస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి



చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్)/చిన్నశంకరంపేట(మెదక్): పెండింగ్ కేసులన్నీ త్వరగా పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం చేగుంట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని రికార్డులతో పాటు ఫిర్యాదులను పరిశీలించారు. గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని స్టేషన్‌హౌస్ అధికారికి తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్ చేగుంట ఎస్ఐ బాలరాజు సిబ్బంది ఉన్నారు. అనంతరం చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. డయల్ 100కు సత్వరం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందికి సూచించారు. బాధిత వ్యక్తుల నుంచి ఫిర్యాదు తీసుకున్న వెంటనే రశీదు అందించాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాల వివరాలను ఎస్ఐ నారాయణగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు.

బతుకుదెరువు కోసం వెళ్లి..

దుబాయ్‌లో గోనెపల్లి వాసి మృతి



రాజు(ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన యువకుడు గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. చిన్నకోడూరు మండలం గోనెపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాజు(36)కు భార్య రజిత, కుమారుడు, కూతురు ఉన్నారు. ఉపాధి కోసం పదేళ్ల కిందట దుబాయ్ వెళ్లాడు. అక్కడ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఏడాది కిందట స్వగ్రామానికి వచ్చి తిరిగెళ్లాడు. మంగళవారం రాత్రి రాజు కూలీ పనులు చేస్తున్న క్రమంలో గుండెపోటు రావడంతో కుప్పకూలాడు. తోటి కూలీలు వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించే క్రమంలో రాజు మృతి చెందాడు. విషయం గ్రామంలో తెలియడంతో విషాదం నెలకొంది. మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారిపై బుధవారం తెల్లవారుజామున రెండు వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో ఇద్దరు మృతి చెందారు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. రాయపోల్ మండలంలోని ఎల్కల్ గ్రామానికి చెందిన తొర్రి దర్శన్(21) ద్విచక్ర వాహనంపై పని మీద మంగళవారం సిద్దిపేటకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాజీవ్‌రహదారిపై వస్తుండగా చిన్న కిష్టాపూర్ బస్టాప్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దర్శన్‌కు తీవ్ర గాయాలు కాగా గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా వైద్యుల సూచనల మేరకు గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

తిమ్మారెడ్డిపల్లి శివారులో..

మెడ్చేల్ జిల్లా నాగారం (కీసర)కు చెందిన గుండ్ల చంద్రశేఖర్(58) కరీంనగర్‌లో ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం సొంత ఇన్నోవా వాహనంలో ఉద్యోగానికి వెళ్లాడు. పని ముగించుకొని బుధవారం రాత్రి బయలు దేరాడు. తిమ్మారెడ్డిపల్లి శివారులోకి రాగానే ముందు వెళ్తున్న వాహన డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో చంద్రశేఖర్ ముందు వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ముందు వెళ్తున్న వాహనం పరారీలో ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

లిఫ్ట్ అడిగి వెళ్తుండగా మహిళ..

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మాసాయిపేట మండలం పోతాన్‌శెట్టిపల్లి శివారులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మనోహరాబాద్ మండలం తుపాకులపల్లి గ్రామానికి చెందిన శివలక్ష్మి(48) చేగుంట మండల చందాయిపేట గ్రామానికి ఓ వేడుకకు వస్తుంది. మాసాయిపేటలో బస్సు దిగి చందాయిపేటకు వెళ్లడానికి ఆటోలు లేక ఓ బైక్ అతడిని లిఫ్ట్ అడిగి వెళ్తుంది. పోతాన్‌శెట్టిపల్లి శివారులోని రాగానే వీరి బైక్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

కారు, బైక్ ఢీ

కౌడిపల్లి(నర్సాపూర్): కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన కౌడిపల్లి మండలం ధర్మాసాగర్ గేట్ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్ కుమార్‌రెడ్డి కథనం మేరకు.. కొల్చారం మండలం దుంపలకుంట తండాకు చెందిన కొర్ర గోపిలాల్ బైక్‌పై హైదరాబాద్ నుంచి ఇంటికి వస్తున్నాడు. ధర్మాసాగర్ గేట్ సమీపంలోనికి రాగానే ఎదురెదురుగా కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గోపిలాల్‌కు తీవ్రగాయాలు కాగా కారుకు ధ్వంసమైంది.